క్లుప్తంగా

ఘనంగా అయ్యప్ప ఇరుముడులు



ఇరుముడుల కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు

కొత్తగూడెంఅర్బన్: అయ్యప్ప మాలధారులు శబరికి బయలుదేరారు. సోమవారం కొత్తగూడెం, రామవరం, రుద్రంపూర్‌లోని ఆలయాల్లో స్వాముల ఇరుముడుల కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలతో సందడి నెలకొంది. రుద్రంపూర్ ఎంపీటీసీ పరమేష్, లక్ష్మణ్, రఘు, మల్లేష్ పాల్గొన్నారు.

గెర్షోముకు సేవా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న గెర్షోము

కొత్తగూడెంఅర్బన్: గాంధీపథం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు చింతలచెరువు గెర్షోముకు అరుదైన పురస్కారం లభించింది. వివిధ రంగాలలో అత్యుత్తమ సేవలు అందించిన వారిని కర్ణాటకలోని బళ్లారిలో శ్రీమాతృ ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకులు భారతరత్న సేవా పురస్కారంతో సత్కరించారు. ఆదివారం బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు పుష్పలత చంద్రశేఖర్, కేంద్ర యువజన సర్వీసులు విభాగం పూర్వ సభ్యులు లోకేష్ ఎం.నాయక్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ వినోద్‌శ్రీవాస్తవ్, సామాజిక వేత్త గోవర్ధన్ దేశాయ్, బీజేపీ కేంద్ర కమిటీ పరిశీలకురాలు నిశ్చిత, జ్ఞానవినోదిని, ఎర్నెస్ట్, అనూష, లీనా ఎలిజిబె పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓకు వినతి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా కోర్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా వైద్యా, ఆరోగ్యశాఖాధికారి వినతిపత్రం అందజేశారు. కమిటీ జిల్లా అధ్యక్షులు బాలాజీ నాయక్, జిల్లా జనరల్ సెక్రెటరీ శివ కుమార్, ట్రెజరర్ మురళి కృష్ణ, వైస్ ప్రెసిడెన్స్ నిశాంత్‌రావు, ప్రియాంక, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ అభ్యర్థి గెలుపు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలోని సెంట్రల్ వర్క్‌షాపులో సోమవారం జరిగిన ఉద్యోగుల సహకార పొదుపు సంఘం ఎన్నికల్లో టీబీజీకేఎస్ అభ్యర్థి వేముల శైలేష్ కిరణ్ డైరెక్టర్‌గా గెలుపొందారు. ఈ సందర్భంగా కిరణ్‌ను రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అభినందించారు.

పోడు భూములకు వసతులు కల్పించండి..

టేకులపల్లి: ఏజెన్సీలో ఆదివాసీ, గిరిజన రైతులు సాగు చేసుకుంటున్న పోడు భూముల్లో బోర్లు వేసుకునేందుకు అనుమతి ఇచ్చి విద్యుత్ సదుపాయం కల్పించాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, జిల్లా నాయకుడు లక్కినేని సురేందర్‌రావు ఐటీడీఏ అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం టేకులపల్లి మండలం చంద్రుతండా, తుమ్మలచలక గ్రామాల పోడు రైతులతో కలిసి ఐటీడీఏ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. విద్యుత్ సదుపాయం, బోర్లు లేకపోవడంతో సాగునీటి వసతి లేక వర్షాలపైనే ఆధారపడాల్సి వస్తోందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. వరప్రసాద్, రాజనాయక్, పూల్ సింగ్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సింగరేణి వేడుకలు



సింగరేణి(కొత్తగూడెం): వందన సమర్పణ చేస్తున్న జీఎం శాలేంరాజు



ఇల్లెందు: పూసపల్లిలో మొదటి మైన్ వద్ద మాట్లాడుతున్న జీఎం కృష్ణయ్య

- సింగరేణి రన్‌లో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు, కార్మికులు
- సంస్థ నూతన టెక్నాలజీతో ముందుకెళ్తోంది
- కొత్తగూడెం, ఇల్లెందు ఏరియాల జనరల్ మేనేజర్లు శాలేంరాజు, కృష్ణయ్య

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి 136వ ఆవిర్భావ వేడుకలు కొత్తగూడెం ఏరియాలో సోమవారం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు ఆధ్వర్యంలో ఏరియా జీఎం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జీఎం సింగరేణి జెండా ఆవిష్కరించారు. అనంతరం రుద్రంపూర్‌లోని అమరవీరుల స్తూపం నుంచి ప్రగతివనం వరకు సింగరేణి రన్ నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన ప్రారంభించారు. అదేవిధంగా సాయంత్రం ప్రగతివనంలో జరిగిన కార్యక్రమంలో ఏరియా సేవా అధ్యక్షురాలు మధురవాణితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జీఎం మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ నూతన టెక్నాలజీతో ముందుకు సాగుతోందని, కంపెనీ నిర్దేశించిన 149.5 లక్షల టన్నుల లక్ష్య సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం ఉత్తమ కార్మికులను అభినందించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను అకట్టుకున్నాయి. ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, ఏఐటీయూసీ నాయకులు గట్టయ్య, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇల్లెందు: ఇల్లెందు ఏరియా సింగరేణి ఆవిర్భావ వేడుకలను జీఎం వి.కృష్ణయ్య ప్రారంభించారు. సోమవారం జీఎం కార్యాలయంలో వివిధ డిపార్ట్‌మెంట్ అధికారులతో కలిసి జెండా ఎగురవేశారు. అనంతరం సింగరేణి పుట్టినిల్లు అయిన ఇల్లెందులో బొగ్గు నిల్వలు కనుగొన్న డాక్టర్ విలియం కింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా రొంపేడు-1 ఇంక్లైన్ వద్ద సింగరేణి ఆవిర్భావ దినోత్సవ స్తూపం వద్ద జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం బి.వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, అధికారుల సంఘం అధ్యక్షుడు శివప్రసాద్, సేవా అధ్యక్షురాలు వి.రమ, అధికారులు కృష్ణమోహన్‌రావు, గోవిందరావు, సాయి స్వరూప్, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సింగరేణి డే వేడుకలను జీఎం వీసం కృష్ణయ్య, ఎమ్మెల్యే కోరం కనకయ్య, సేవా అధ్యక్షురాలు వి.రమ ప్రారంభించారు. ఈ సందర్భంగా మీనా నృత్యాలయ బృందం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

టేకులపల్లి: సింగరేణి డే వేడుకలు సోమవారం కోయగూడెం ఓపెన్‌కాస్టులో ఘనంగా జరుపుకున్నారు. కేఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ మిడిదొడ్డి గోవిందరావు జెండా ఎగురవేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం సింగరేణి సాధించిన ప్రగతి, సాధించబోయే లక్ష్యాలను వివరించారు. ఉత్పత్తి, ఉత్పాదకతపై దృష్టి సారించాలని, ప్రమాదాలు లేకుండా రక్షణ సూత్రాలు పాటిస్తూ ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఇంజనీర్ శివశంకర్, మేనేజర్ సౌరభ్ సుమన్, వెల్ఫేర్ ఆఫీసర్ వరిపెల్లి అజయ్, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి బాలాజీ, ఐఎన్‌టీయూసీ బ్రాంచి సెక్రటరీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



టేకులపల్లి: కేఓసీలో మాట్లాడుతున్న పీఓ గోవిందరావు



ఇల్లెందు: స్టాళ్లను పరిశీలిస్తున్న సేవా అధ్యక్షురాలు వీసం రమ, జీఎం కృష్ణయ్య, ఎమ్మెల్యే కోరం కనకయ్య, చైర్మన్ డీవీ, అధికారులు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రైతులను సత్కరిస్తున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచరూరల్: రైతు సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలన చేస్తోందని మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా సంగం గ్రామంలో సోమవారం పలువురు రైతులను కొత్వాల సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అన్నదాతలు నిత్యం ఆనందంగా ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉందన్నారు. రైతులకు ఒకేసారి రూ.రెండు లక్షల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా రూ.21వేల కోట్ల రుణమాఫీ చేసిందన్నారు. సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తుండంతోపాటు రైతుబీమా పథకాన్ని అమలు చేస్తూ రైతులకు అండగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ చౌవు గాని పాపారావు, రైతులు గంగుల వెంకటేశ్వరరెడ్డి, అప్పాజు సత్యనారాయణ, నస్కూరి రమేష్, గంగుల సత్యనారాయణరెడ్డి, దనుగూరి వెంకన్న, సురేష్, బాలరాజు, మస్తాన్, భగవాన్ పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగులు పంపిణీ



విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న దృశ్యం

టేకులపల్లి: తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) ఆధ్వర్యంలో సోమవారం టేకులపల్లి మండలంలోని బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేశారు. అమెరికాలో స్థిరపడిన కొత్తగూడేనికి చెందిన తూనుగుంట్ల శిరీష తానా ఫౌండేషన్ ద్వారా అమెరికా నుంచి ఈ స్కూల్ బాగ్స్ సమకూర్చారు. బొమ్మనపల్లి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ పొగాకు లక్ష్మి, హెచ్ఎం ఎం.జ్యోతిరాణి, టీచర్ జర్పల పద్మ, ఎన్నారై పేరెంట్స్ కమిటీ మెంబర్ మిట్టపల్లి పాండురంగారావు, కొత్తగూడెం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొదుమూరి శ్రీనివాసరావు, కొత్తగూడెం ఆర్య వైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి కంభంపాటి రమేష్, ఎన్నారై ఫౌండేషన్ ప్రోగ్రామ్స్ కమిటీ మెంబర్ రమేష్, కొర్రా శ్రీను, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా



ధర్నా చేస్తున్న పీఓడబ్ల్యూ, పీవైఎల్ నాయకులు

ఇల్లెందురూరల్: కొమరారం పీహెచ్‌సీలో సమస్యల పరిష్కారం కోరుతూ మాస్‌లైన్ అనుబంధ పీఓడబ్ల్యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షురాలు సావిత్రి మాట్లాడుతూ.. కొమరారం పీహెచ్‌సీ పరిధిలో 40వేల జనాభాతో 27 గ్రామాలు ఉన్నట్లు చెప్పారు. పూర్తి ఏజెన్సీగా పిలవబడే ఈ ప్రాంతంలో ప్రజలకు ప్రభుత్వ పరంగా వైద్యసేవలు అందక, ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే ఆర్థిక స్థోమత లేక మృతి చెందుతున్నారని వాపోయారు. ఆస్పత్రిలో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, మెరుగైన వైద్యసేవలు అందిచాలని, ఆస్పత్రిలో పడకల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. గదుల కొరత కారణంగా గర్భిణులు ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బాదావత్ రమేష్, ముత్తమ్మ, దేవా, కాంపాటి పృథ్వీ, ఎలుగు శాంతారావు, ఇస్లావత్ కోటేష్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

టీపీజీపీడబ్ల్యూయూ మండల కమిటీ ఎన్నిక



బిచ్చు నాయక్



ఈసం రమేష్

టేకులపల్లి: మండల కేంద్రం టేకులపల్లిలో సోమవారం తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఇఫ్టూ) సమావేశం జరిగింది. మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మూడు బిచ్చు నాయక్ (టేకులపల్లి), ప్రధాన కార్యదర్శిగా ఈసం మహేష్ (చింతోనిచెలక)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆర్‌ఎంపీలపై చర్యలు తీసుకోవాలి

జూలూరుపాడు: స్థాయికి మించి వైద్యసేవలు అందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఎస్పీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలోని ఆర్ఎంపీ, పీఎంపీలు స్థాయికి మించి ఇంజెక్షన్లు, యాంటీబయాటిక్స్, పెయిన్ కిల్లర్స్ ఇస్తుండడంతో ప్రజలు కిడ్నీ వ్యాధి బారిన పడుతున్నారన్నారు. వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

జరిమానా

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపల్ పరిధిలోని ఓ వైన్‌షాపులో మున్సిపల్ సిబ్బంది ప్లాస్టిక్ వినియోగంపై తనిఖీలు చేశారు. వైన్ షాపులో ప్లాస్టిక్ కవర్లు వినియోగించడాన్ని గుర్తించిన సిబ్బంది రూ.2 వేల జరిమానాను విధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజలు నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వినియోగించరాదని తెలిపారు. మార్కెట్‌కు వచ్చేవారు ఇంటి నుంచే సంచులు తెచ్చుకోవాలని, షాపు ముందు బోర్డులో ఈ విషయం రాసిపెట్టాలని సూచించారు.

వే బ్రిడ్జీల తనిఖీ

జూలూరుపాడు: మండల కేంద్రంలోని వే బ్రిడ్జీలను జిల్లా తూనికలు, కొలతల అధికారి కె.మనోహర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన జూలూరుపాడు సబ్ మార్కెట్ యార్డు సమీపంలోని వే బ్రిడ్జీల కాంటాలను పరిశీలించారు. మాట్లాడుతూ.. తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తక్కువ బరువు ఉంటే ఎలక్ట్రానిక్ కాంటాతో పత్తి తూకం వేయించుకోవాలని రైతులకు సూచించారు. టన్ను బరువు కంటే అధికంగా ఉంటే వే బ్రిడ్జీపై తూకం పెట్టుకోవాలన్నారు.

ఉత్తర్వులు అందజేత

చుంచుపల్లి: వరంగల్ జిల్లాలో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ మరణించిన మహమ్మద్ రజాక్ హుస్సేన్ భార్య మైబూబీని సుజాతనగర్ మండల పరిషత్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా నియమిస్తూ కారుణ్య నియామక ఉత్తర్వులను జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.నాగలక్ష్మి సోమవారం జెడ్పీ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రంంలో కార్యాలయ సూపరింటెండెంట్ వీబీకే ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ ఎండీ నయీముద్దీన్, శ్రీకాంత్, పులికంటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

పాల్వంచరూరల్: కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం నాయకులు సోమవారం తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ వివేక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ... 2019 డిసెంబలో రైతులతో చర్చలు జరిపిన కేంద్ర ప్రభుత్వం... వ్యవసాయ చట్టాలను వెనక్కు తీసుకుంటామని, సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి మరిచిందన్నారు. దీనికి నిరసనగా ఢిల్లీలో పాదయాత్ర చేస్తున్న రైతులను సరిహద్దుల్లోనే అడ్డుకోవడం, రైతు ఉద్యమాన్ని అణిచివేయాలని చూడడం హేయమైన చర్య అన్నారు. తక్షణమే జాతీయ వ్యవసాయ విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తులసీరాం, అడుసుమల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, బండి నాగేశ్వరరావు, అన్నారపు వెంకటేశ్వర్లు, పద్మజ, ఇట్టి వెంకట్రావ్, నిమ్మల రాంబాబు పాల్గొన్నారు.

ఆసరా భృతి అందించండి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఉపాధి కూలీలతో పాటు వ్యవసాయ కూలీలకు ఆసరా భృతి అందించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము, జిల్లా అధ్యక్షుడు నాయిని రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రూ.12 వేల ఆసరా భృతి ఇవ్వనున్నట్లు ప్రకటించడం హర్షించదగ్గ విషయమన్నారు. కానీ 100 రోజులు పనిచేసిన ఉపాధి కూలీలకే ఇస్తామని ఆమోదించదగ్గ విషయం కాదన్నారు. ఉపాధికూలీలు కాకుండా వ్యవసాయ రంగంలో కూడా అనేకమంది కూలీలు ఉన్నారని వీరికి కూడా ఆసరా భృతి అందించాలని డిమాండ్ చేశారు.

సూపర్ మార్కెట్‌ను పునరుద్ధరించండి..

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా రామవరంలోని సూపర్ మార్కెట్ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్‌కు రామవరం 10వ వార్డు కౌన్సిలర్ మునిగడప పద్మ వినతిపత్రం అందజేశారు. సోమవారం రామమరంలోని కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన సీఎండీని కలిశారు. ఆమె మాట్లాడుతూ.. రామవరం సూపర్ మార్కెట్ కొంతకాలం నడిచిందని, ఆ తరువాత అధికారుల నిర్లక్ష్యం వలన నిలిచిపోయిందని, ఫలితంగా ఆ భవనం శిధిలావస్థకు చేరినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో నిధులు మంజూరు చేసి షాపింగ్‌మాల్, నేషనల్ బ్యాంకు ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా ఏళ్ల తరబడి నివాసముంటున్నవారి ఇళ్లకు మరమ్మతులు చేసుకునే అవకాశం కల్పించాలని విన్నవించారు. అదేవిధంగా రామవరంలోని అంబేద్కర్ పార్క్‌లో ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టాలని కోరారు. రామవరం ప్రాంత అభివృద్ధికి సింగరేణి సంస్థ అందిస్తున్న సహకారానికి అభినందనలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

జూలూరుపాడు: ప్రజా, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు బీజేపీ, బీజేఎంసీ జాతీయ చైర్మన్ బిస్వప్రియరాయ్‌చౌదరి, జాతీయ అధ్యక్షుడు ఆర్నాబ్ చటర్జీ అన్నారు. సోమవారం జూలూరుపాడు యల్లంకి గార్డెన్స్‌లో బీజేపీ, బీజేఎంసీ ప్రోగ్రామ్ ఇన్‌చార్జి, విశ్వ హిందూ మహా సంఘ్ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దిశెట్టి సామేలు ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ మజ్దూర్ సంఘ్ శాంతియుత సభ జరిగింది. ఈ సందర్భంగా బీజేఎంసీ జాతీయ చైర్మన్ రాయ్ చౌదరి, జాతీయ అధ్యక్షుడు చటర్జీలు మాట్లాడుతూ దేశంలో అనేక మంది కార్మికులు రోజువారి జీవనం గడిపేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో రామ్‌కుమార్ వాలియా, మహవీర్ కొరివి, యశ్ పవర్, తెలంగాణ, ప్రశాంత్‌కుమార్, రెడ్డి, పలగాని శ్రీనివాస్‌గౌడ్, రాజులపాటి ఐలయ్య, కొడెం సీతాకుమారి, ముక్తి మల్లేశ్, భూక్యా రవి, స్వామి, నిర్మల పాల్గొన్నారు.

గ్రామాల విలీనం వద్దే వద్దు..



మాట్లాడుతున్న బాధితులు

టేకులపల్లి: బద్దుతండా పంచాయతీ తుమ్మలచెలక, తుమ్మలచెలక స్టేజీ, సామ్యా తండా, కొత్తగుంపు గ్రామాలతో తుమ్మలచెలక నూతన పంచాయతీ, తొమ్మిదో మైలుతండా పంచాయతీ కోటల్ల గ్రామాన్ని బేతంపూడి పంచాయతీలో కలపాలని, బేతంపూడి పంచాయతీ బేతంపూడి స్టేజీ, వెంకట్యా తండా గ్రామాలను తొమ్మిదోమైలు తండా పంచాయతీలో కలపాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపిన విషయం తెలిసిందే. ఈ విషయం సోమవారం పత్రికల్లో రావడంతో బేతంపూడి స్టేజీ, వెంకట్యా తండాకు చెందిన ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. విలీనం వద్దే వద్దని కొత్త పంచాయతీగా గుర్తించాలని కోరుతూ.. హుటాహుటిన కలెక్టరేట్‌కు వెళ్లి ప్రజావాణిలో, టేకులపల్లి వచ్చిన కలెక్టర్‌కు, ఎమ్మెల్యేకు, ఎంపీడీఓలకు వినతిపత్రాలు అందజేశారు. బాధిత గ్రామస్తులు మాట్లాడుతూ... బేతంపూడి స్టేజీ, వెంకట్యాతండా గ్రామాలు అనేక సంవత్సరాలుగా బేతంపూడి పంచాయతీలో ఉన్నాయని ఇప్పుడు గ్రామస్తులకు తెలియకుండా, అభిప్రాయ సేకరణ లేకుండా, పంచాయతీ తీర్మానం లేకుండా వేరే పంచాయతీలో ఎలా కలుపుతారని ఆవేదన వ్యక్తం చేశారు. తొమ్మిదోమైలు తండాలో విలీనం ఆలోచన మానుకోవాలన్నారు. బేతంపూడి జీపీలోనే ఉంటామని లేకపోతే బేతంపూడి స్టేజీ, వెంకట్యా తండా, తంగెళ్ల తండా మూడు గ్రామాలతో కొత్త పంచాయతీ ఏర్పాటు చేయాలని కోరారు. కొత్త పంచాయతీ ఏర్పాటుకు కావాల్సిన అన్ని అర్హతలు ఉన్నాయని సుమారు 1600 వరకు ఓటర్లు ఉన్నారని, 2500 జనాభా ఉందని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా విలీనం చేస్తే నిరసన ఉద్యమాలు చేస్తామని, ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. ధరావత్ హుస్సేన్‌నాయక్, ఆంగోతు లక్‌పతి, బాణోతు భద్రు, బోడ వస్యా, వెంకన్న, శ్రీను, భాస్కర్, మోహన్, బాల, హచ్చ పాల్గొన్నారు.

27, 28న జీపీ కార్మికుల టోకెన్ సమ్మె



సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

ఇల్లెందురూరల్: సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 27, 28వ తేదీలలో టోకెన్ సమ్మె చేపడుతున్నట్లు పంచాయతీ వర్కర్లు సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి సారంగపాణి, గ్రామపంచాయతీ వర్కర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జటంగి వెంకన్న మాట్లాడుతూ.. ఆరోగ్యాలను పణంగా పెట్టి చెత్తచెదారంలో పనులు చేస్తున్న పంచాయతీ కార్మికుల సంక్షేమంపై పాలకులు చిన్నచూపు చూడటం సరికాదన్నారు. మున్సిపాలిటీ, పంచాయతీలలో ఒకే పని చేస్తున్న కార్మికులకు వేతనాల చెల్లింపులో వ్యత్యాసం అన్యాయమన్నారు. ఆ అరకొర వేతనాలకు కూడా నెలల తరబడి వేచి చూడాల్సి వస్తోందని వాపోయారు. మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, మెరుగైన వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర సమస్యల పరిష్కారం లక్ష్యంగా టోకెన్ సమ్మె చేపడుతున్నామని వివరించారు.

28నుంచి విద్యావైజ్ఞానిక మహాసభలు



ఇల్లెందురూరల్: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: ఈ నెల 28 నుంచి మూడు రోజుల పాటు నల్గొండ జిల్లాలో నిర్వహిస్తున్న విద్యావైజ్ఞానిక 6వ రాష్ట్ర మహాసభల ప్రచార పోస్టర్లను సోమవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి జయరాజు, మండల శాఖ అధ్యక్షుడు రాంబాబు మాట్లాడుతూ.. 27, 28, 29 తేదీలలో నిర్వహించే విద్యావైజ్ఞానిక మహాసభలలో ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కోసం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పలు తీర్మానాలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యారంగంలో ఎదుర్కోబోయే సవాళ్లను అధిగమించేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులకు మార్గనిర్దేశం చేయనున్నారని వివరించారు. మహాసభలకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, శేషగిరిరావు, కృష్ణవేణి, అన్నపూర్ణ, రమేష్, భావ్‌సింగ్, మాధవి, రఘు, రాంచంద్రయ్య, శ్రీను, ఉమ, త్రివేణి, కృష్ణ, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మొండివైఖరి వీడాలి



టేకులపల్లి: ఐటీడీఏ వద్ద సీఆర్‌టీలకు సంఘీభావం తెలిపి మాట్లాడుతున్న హరిప్రియ

జూలూరుపాడు: సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఎస్కే చాంద్‌పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ... రెండు వారాలుగా సమగ్ర శిక్షా ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలంటూ సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని, అధికారంలోకి వచ్చిన తరువాత మొండి వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. కేజీబీవీ విద్యార్థులకు తరగతులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఇల్లెందు: గిరిజన సంక్షేమ శాఖలో పని చేస్తున్న సీఆర్‌టీల సమస్యలను, సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని టీపీటీఎఫ్ డిమాండ్ చేసింది. సోమవారం ఇల్లెందులో టీపీటీఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.వెంకట్రాం, పి.సర్వేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేజీబీవీ, ఐటీడీఏ సీఆర్‌టీలను రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, మినిమం స్కేల్ ఇవ్వాలని, గ్రీన్ చానల్ ద్వారా ప్రతీనెల 1న వేతనాలు చెల్లించాలని, పెండింగ్ వేతనాలు అందజేయాలని కోరారు.

టేకులపల్లి: రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ శాఖ, సమగ్ర శిక్షా అభియాన్‌లో 20 ఏళ్లుగా కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లుగా పనిచేస్తున్న వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి వారు చేస్తున్న నిరవధిక సమ్మెను విరమింపజేసి కేజీబీవీ మరియు గిరిజన సంక్షేమ శాఖలోని ఆశ్రమ పాఠశాలలలో విద్యనభ్యసిస్తున్న పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూడాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు గుగులోత్ హరిలాల్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం విలేకరులతో మాట్లాడారు. కేజీబీవీ మరియు ఐటీడీఏ సీఆర్‌టీలను రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, అప్పటి వరకు పీఆర్సీ 2020 ప్రకారం మినిమం టైం స్కేల్ ఇవ్వాలని, గ్రీన్ చానల్ ద్వారా ప్రతీనెల 1వ తేదీన జీతాలు చెల్లించాలని కోరారు. పెండింగ్ జీతాలు వ్యక్తిగత ఖాతాలలో జమ చేయాలని, రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా అన్నిరకాల సెలవులు వర్తింపజేయాలని పేర్కొన్నారు. హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, మరణించిన సీఆర్‌టీలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి వారి కుటుంబం నుండి ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.

టేకులపల్లి: ఆశ్రమ పాఠశాల కాంట్రాక్టు ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉపాధ్యాయులు ఐటీడీఏ ఎదుట రిలే నిరాహారదీక్ష చేస్తున్నారు. దీక్షా శిబిరానికి వెళ్లి దీక్షలో కూర్చుని బీఆర్ఎస్ పార్టీ తరపున హరిప్రియ సంఘీభావం తెలిపారు. సీఆర్‌టీల ఉద్యమానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.